క్లుప్తంగా

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: మండలంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళికను అనుసరించి మహిళలకు స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో డి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 50 ఏళ్ల లోపు బీసీ మహిళలు, కాపు, ఈడబ్ల్యూఎస్ (ఆర్య, వైశ్య, కమ్మ, క్షత్రియ, రెడ్డి, ఈబీసీ– బ్రాహ్మణులు) మహిళలకు బేసిక్ టైలరింగ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామన్నారు. అలాగే స్వయం ఉపాధి పథకాల కోసం బీసీలకు స్వయం ఉపాధి, జనరిక్ ఫార్మసీ (బి ఫార్మసీ, డి ఫార్మసీ), కాపు సామాజిక వర్గానికి (కాపు, తెలగ, బలిజ, ఒంటరి) చెందిన యువతకు సబ్సిడీతో ఆర్థిక సాయం మంజూరు చేస్తామన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) అభ్యర్థులు మీ దగ్గరలో నెట్ సెంటర్ / మీ సేవ / గ్రామ సచివాలయంలో ఈ నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మత్తు నుంచి యువతను కాపాడుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

కడియం: గంజాయి, మత్తు, మాదక ద్రవ్యాల నుంచి యువతను కాపాడుకునేందుకు కృషి చేయాలని సైకాలజిస్ట్, పుష్కర హరిత సంస్థ డైరెక్టర్ పి.సుందరరాజు అన్నారు. పుష్కర సంస్థ, విశాఖపట్నంకు చెందిన ఎస్ఎల్‌సీఏ సంస్థలు వేమగిరి వృద్ధుల ఆశ్రమం వద్ద మాస్టర్ వలంటీర్లకు బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరరాజు మాట్లాడుతూ మత్తుకు బానిసలైన వారి ప్రవర్తన ఉంటుందో, చికిత్స ఎలా ఇస్తారో వివరించారు. సైకాలజిస్ట్ డాక్టర్ పి.సుధారాణి, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ ధనుంజయ, జిల్లా నార్కోటిక్స్ విభాగం సీఐ ధనుంజయ, వై.రాంబాబు, వృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమశాఖ సూపరింటెండెంట్ ఎ.రాజు మాట్లాడారు. అనంతరం నషాముక్త భారత్ పోస్టర్ ను ఆవిష్కరించారు.

విశ్వవిద్యాలయాల విలీనం తగదు

కడియం: ఉద్యాన, వ్యవసాయ, పశువైద్య విశ్వవిద్యాలయాల విలీనం ప్రతిపాదన చేయడం తగదని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2007లో ఉద్యాన విశ్వవిద్యాలయం ఏర్పాటు ద్వారా ఉద్యాన రంగం విస్తరించడంతో పాటు నర్సరీ పరిశోధన, శిక్షణ, మార్కెటింగ్ అంశాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. హార్టికల్చర్, డ్రై ఫ్లవర్ టెక్నాలజీ, మొక్కల ఆరోగ్య పరీక్షలు, స్మార్ట్ ఇరిగేషన్, అధునాతన నర్సరీల నిర్వహణ తదితర మార్పులకు ఉపయోగపడిందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉద్యాన, వ్యవసాయ విశ్వవిద్యాలయాలను విలీనం చేయడం ఉద్యాన రంగం ప్రగతికి ఆటంకం కలుగుతుందన్నారు. ఉద్యాన రంగ ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకుని ఉద్యాన విశ్వవిద్యాలయాన్ని యథాతథంగా కొనసాగించాలన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి వినతిపత్రం అందజేస్తామన్నారు.

గుర్రపు డెక్క నివారణకు మందు పిచికారీ



గుర్రపు డెక్కపై కలుపు మందు జల్లుతున్న డ్రోన్

రాజమహేంద్రవరం రూరల్: ఆవ కాలువలో ఉన్న గుర్రపుడెక్క కారణంగా బొమ్మూరు, హుకుంపేట గ్రామాలలో దోమల బెడద ఎక్కువగా ఉంది. ఆవ కాలువ వెంబడి ప్రజలు ఈ సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో నగర పాలక సంస్థ కమిషనర్ ,గ్రామ పంచాయతీల అధికారి కేతన్ గార్గ్ గుర్రపు డెక్కపై కలుపు మందు పిచికారీ చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో బుధవారం బొమ్మూరు గ్రామంలోని ఆవకాలువలో గుర్రపు డెక్కను చంపేందుకు డ్రోన్ సహాయంతో కలుపుమందు చల్లించారు. ఈవోపీఆర్అండ్ఆర్డీ ఆర్మ్ స్ట్రాంగ్, పంచాయతీ కార్యదర్శి జి.కాశీ విశ్వనాథ్ దీన్ని పర్యవేక్షించారు.

ఇంటర్ పరీక్షలకు 17 మంది గైర్హాజరు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రంలో బుధవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్ పేపర్–2, ఎకనామిక్స్ పేపర్–2 పరీక్షలు జరిగినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెంటెంట్లు బి.హేమ, ఎస్.మాధురి తెలిపారు. మొత్తం 480 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా ఏ సెంటర్‌లో 14 , బి సెంటర్‌లో 3 మంది పరీక్షలు రాయలేదన్నారు. డిపార్టుమెంటల్ అధికారులుగా ఏపీఆర్‌వీ ప్రసాద్, ఎంవీఎస్ కృష్ణ వ్యవహరించారు. కాగా.. పరీక్షా కేంద్రాన్ని ప్రాంతీయ తనిఖీ అధికారి (ఆర్ఐఓ) వీఎల్ నరసింహం, సిట్టింగ్ స్క్వాడ్ పరిశీలించారు.

వైఎస్సార్ సీపీ జెండా.. పేదలకు అండ

- సంక్షేమమే జగన్ ధ్యేయం
- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం
- భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు



వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకల్లో మాట్లాడుతున్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, మార్గాని నాగేశ్వరరావు



యువత పోరుకు ర్యాలీగా వెళ్తున్న జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేష్



కడియం నుంచి బైక్ ర్యాలీగా వెళుతున్న కొత్తపల్లి శివాజీ తదితరులు



ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



కడియం సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న గిరజాల బాబు, సతీష్ చంద్ర స్టాలిన్

రాజమహేంద్రవరం రూరల్: పేదల సంక్షేమం, తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాల సాధనకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీని స్థాపించారు. అప్పటి నుంచి ప్రజల సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారు. ప్రతిపక్షంలో ఉండగా నిరంకుశ పాలనపై ధ్వజమెత్తి ప్రజలకు అండగా నిలిచారు. అధికారంలోకి వచ్చినప్పుడు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలు అమలు చేసి జనరంజక పాలన అందించారు. ఒక రకంగా చెప్పాలంటే వైఎస్సార్ సీపీ జెండాను పేదలకు అండగా మార్చారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని రూరల్, సిటీ నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని అధికారం ఉన్నా లేకున్నా నిత్యం ప్రజా సమస్యలపై పోరాడతామంటూ తమ మద్దతు తెలిపారు.

బొమ్మూరులో..

బొమ్మూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్‌ను కట్ చేశారు. మాజీ మంత్రి తానేటి వనిత, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యేలు తలారి వెంకటరావు, సత్తి సూర్యనారాయణరెడ్డి, పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి శ్రీనివాస్, చందన నాగేశ్వర్, జక్కంపూడి గణేష్ తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బెదిరింపులకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలెవ్వరూ భయపడే పరిస్థితి లేదన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి కార్యకర్తలందరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజల తరఫున పోరాటం చేస్తున్నామన్నారు.

శాటిలైట్ సిటీలో..

శాటిలైట్ సిటీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పార్టీ మండల గ్రీవెన్స్ అధ్యక్షుడు బత్తిన అప్పారావు, పెద్దలు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు. బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే పార్టీ కార్యాలయం వద్ద పతాకాన్ని ఎగురవేశారు.

రాజమహేంద్రవరం సిటీలో..

స్థానిక మార్గాని ఎస్టేట్స్‌లోని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం సిటీ కార్యాలయంలో మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, రాష్ట్ర బీసీ నాయకులు మార్గాని నాగేశ్వరరావు, నగర మాజీ అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులతో ఎంపీ భరత్‌రామ్ కేక్ కట్ చేసి, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని మార్గాని భరత్‌రామ్ పేర్కొన్నారు. వైఎస్సార్ మరణం తరువాత తండ్రి ఆశయాలను నెరవేర్చడానికి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని కష్టాలు పడ్డారో, ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారో చూశామన్నారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను జగన్ నెరవేర్చారన్నారు. ప్రతి కార్యకర్తకు వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుందని భరత్ స్పష్టం చేశారు.అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం భారీ బైక్ ర్యాలీలతో యువత పోరు కార్యక్రమానికి తరలి వెళ్లారు.

జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో..

యువత పోరుకు మద్దతుగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, యువ నేత జక్కంపూడి గణేష్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రకాష్ నగర్‌లోని రాజా స్వగృహం నుంచి నందం గనిరాజు జంక్షన్, బైపాస్ రోడ్డు, తాడితోట స్టేడియం రోడ్డు, శ్యామల టాకీస్ జంక్షన్, కోటిపల్లి బస్టాండ్, ఐదు బళ్లమార్కెట్ మీదుగా రాజమహేంద్రవరం రూరల్ పార్టీ కార్యాలయానికి చేరుకుంది. అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు సాగింది. పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి.

పోరాటానికి చిహ్నం

కడియం: వైఎస్సార్ సీపీ జెండా తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీక అని, అలుపెరగని పోరాటానికి చిహ్నమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, మండల అధ్యక్షుడు సతీష్ చంద్ర స్టాలిన్ అన్నారు. కడియం దేవీగుడి సెంటర్‌లో వైఎస్సార్ సీపీ మండల నాయకుల ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించి, పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాడాల చక్రవర్తి, ఊటుకూరి శైలజ, తిరుమలశెట్టి శ్రీను, ఈలి గోపాలం, సాపిరెడ్డి సూరిబాబు ఆకుల సుబ్బు, కొండపల్లి పట్టియ్య, అయినవిల్లి వెంకటేశ్వరరావు, ఆరెటి వెంకట్రావు, సర్కార్ బాషా, గుత్తుల వాసు, మహిచర్ల శ్రీనివాస్, దాసరి నాగేంద్ర, చింతపర్తి రాంబాబు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు కొత్తపల్లి శివాజీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద జరిగే యువత పోరు కార్యక్రమానికి భారీ బైక్ ర్యాలీగా తరలివెళ్లారు.

అసంపూర్తి ఇళ్లకు అదనపు సాయం



కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: పీఎంఏవై అర్బన్, గ్రామీణ్ 1.0 పథకాల ద్వారా జిల్లాలోని 429 లేఅవుట్లు, సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11,345 మంది ఎస్సీలు, 549 మంది ఎస్టీలు, 15,547 మంది బీసీలకు రూ.138.57 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేల మేర అందిస్తామన్నారు. దీనిని వినియోగించుకుని, వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయిన వారు మే నెలాఖరులోగా నిర్మాణం పూర్తి చేసుకోవాలని కోరారు. నియోజకవర్గాల వారీగా అనపర్తిలో 3,926, రాజానగరం 2,530, రాజమండ్రి రూరల్ 2,082, రాజమండ్రి సిటీ 4,987, కొవ్వూరు 4,611, నిడదవోలు 3,825, గోపాలపురంలో 5,480 మందికి ఈ సాయం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. దీనిపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అలరించిన హరికథా గానం



హరికథాగానం చేస్తున్న వెంకట సింహాచలశాస్త్రి

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ముప్పవరపు వెంకట సింహాచల శాస్త్రి గానం చేసిన శంకర విజయం హరికథ శ్రోతలను అలరించింది. గోదావరి గట్టున ఉన్న త్యాగరాజ నారాయణ దాస సేవా సమితి ఆడిటోరియంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో విజయవాడకు చెందిన పాలపర్తి సీతా రామాంజనేయశాస్త్రి వయొలిన్, తిరుపతికి చెందిన బుద్ధవరపు మారుతీ రఘురామ్ మృదంగం సహకారాలను అందించారు. సమితి కార్యవర్గ సభ్యులు కళాకారులను సత్కరించారు.పెద్ద సంఖ్యలో సంగీతాభిమా నులు పాల్గొన్నారు.

నేడు హరిహరనాథ సభ

గురువారం జరిగే సాహితీ రూపకం హరిహరనాథ సభలో ప్రముఖ సాహితీ వేత్తలు పాల్గొంటారు. తిక్కన సోమయాజిగా మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి, శ్రీనాథునిగా తాతా సూర్యరామ సందీప్ శర్మ, పోతనగా నోరి నారాయణమూర్తి, ధూర్జటిగా రాంభట్ల పార్వతీ శర్మ, త్యాగయ్యగా ముప్పవరపు వెంకట సింహాచలశాస్త్రి పాల్గొంటారు.

ప్రపంచ దేశాల్లో బైబిల్ మిషన్ విస్తరణ



సభలో మాట్లాడుతున్న చైర్మన్ సజీవరావు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం కేంద్రంగా దేవదాసు అయ్యగారు ప్రారంభించిన బైబిల్ మిషన్ నేడు ప్రపంచ దేశాలలో విస్తరించిందని బైబిల్ మిషన్ చైర్మన్ రెవరెండ్ డాక్టర్ పి.సజీవరావు అన్నారు. స్థానిక మార్గాని ఎస్టేట్‌లో నిర్వహిస్తున్న బైబిల్ మిషన్ 58వ మహాసభలు బుధవారం రెండో రోజుకు చేరుకున్నాయి. సభకు ముఖ్య అతిథిగా హాజరైన సజీవరావు మాట్లాడుతూ 1938లో బైబిల్ మిషన్ ప్రారంభమైందన్నారు. ఏ మతాన్ని, ఇతర మిషనరీలను ఏమాత్రం విమర్శించకుండా ఏసుక్రీస్తు ప్రేమను ప్రపంచ జనులకు తెలియజేస్తోందన్నారు. డాక్టర్ షారోన్‌కుమార్ ఆధ్వర్యంలో మహాసభలు అద్భుతంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. రెండవ రోజు సభలో బైబిల్ మిషన్స్ వైస్ ప్రెసిడెంట్ ఎ.దేవ్‌రావు మొదటి ఉపదేశం అందించగా, రెండవ ఉపదేశాన్ని సజీవరావు ఇచ్చారు. బైబిల్ మిషన్ సెక్రటరీ డాక్టర్ వై.ఇమ్మానుయేలు, జాయింట్ సెక్రటరీ జీఆర్ ఇమ్మానుయేలు తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో ఈ–క్రాప్ జాబితా



దోమాడలో జాబితాను ప్రదర్శిస్తున్న ఏఓ మణిదీప్ తదితరులు

పెదపూడి: మండలంలోని రైతు సేవాకేంద్రాల్లో 2024–25 సంవత్సరానికి సంబంధించిన ఈ–క్రాప్ జాబితాను ప్రదర్శనకు ఉంచామని మండల వ్యవసాయశాఖాధికారి టీవీఆర్ మణిదీప్ తెలిపారు. ఆయన దోమాడ గ్రామంలోని రైతు సేవాకేంద్రంలో ఈ ప్రక్రియను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 17,267 ఎకరాల్లో సుమారు 11,104 మంది రైతులు పంటలను సాగు చేస్తున్నారన్నారు. ఈ నెల 19వ తేదీలోపు రైతులు ఆ జాబితాలో తప్పులుంటే సవరించుకోవాలన్నారు. అనంతరం తుది జాబితాను ప్రచురిస్తారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మీనవల్లి శారదాదేవి, రైతులు మీనవల్లి సత్తిబాబు, ముత్యాల శ్రీను, వ్యవసాయ సహాయకుడు దేవగుప్తాపు శ్రీను పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమం

బిక్కవోలు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)పై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం డిజిటల్ అసిస్టెంట్లకు బుధవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిష్కరించిన తర్వాత ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలన్నారు. ఎంటీటీ ట్రైనర్ సూరిశెట్టి సురేష్ మాట్లాడుతూ ప్రజల నుంచి తీసుకున్న అభిప్రాయాన్ని యాప్‌లో ఎలా పొందుపర్చాలో వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జాన్ మిల్టన్ తదితరులు పాల్గొన్నారు.

పరస్పర సహకారంతోనే అభివృద్ధి

- జేసీ చిన్న రాముడు
- ఉత్సాహంగా ఇండస్ట్రీ మీట్



ఇండస్ట్రీ మీట్‌లో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

రాజమహేంద్రవరం రూరల్: పారిశ్రామికవేత్తలు, ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ పరస్పర సహకారంతోనే జిల్లాలో అభివృద్ధి సాధ్యమని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. జేఎన్ రోడ్డులోని ప్రైవేటు సమావేశ మందిరంలో ఇండస్ట్రీ మీట్ పేరుతో బుధవారం ఒక రోజు వర్క్ షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జేసీ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. ఆయా పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యం పెంచే ప్రయత్నంలో వారి సూచనలు సలహాలు స్వీకరించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం సభానంతరం ప్యానల్ డిస్కషన్ సెషన్ నిర్వహించారు. సర్వారాయ షుగర్స్ ప్రతినిధి రాజ్‌కుమార్, ఆటోమోటివ్ మ్యాను ఫ్యాక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి అశోక్ కుమార్, వరుణ్ మోటార్స్ ప్రతినిధి సుబ్బారావు, రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాల ఎంప్లాయబిలిటీ స్కిల్ సెంటర్ ప్రతినిధి యర్రా రాము, నవతా ట్రాన్స్‌పోర్ట్ ప్రతినిధి వేదవ్యాస్ తదితరులు పాల్గొన్నారు. ఆయా పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రామన్ శ్రీవనిధర్ రామన్, జిల్లా ఉపాధి కల్పనాధికారి హరిచంద్ర ప్రసాద్, యంగ్ ప్రొఫెషనల్ సీహెచ్ రాజ్‌కుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీడీజీ మురళి పాల్గొన్నారు.

బంగారు గొలుసు, చెవిదుద్దుల చోరీ

సీతానగరం: రఘుదేవపురంలోని ఓ ఇంటిలో బంగారు ఆభరణాలను దొంగలు చోరీ చేశారు. హెడ్ కానిస్టేబుల్ రేలంగి శ్రీనివాస్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్తుపు నాగజ్యోతి, తన భర్తతో కలిసి బుధవారం తెల్లవారుజామున పొలం పనులకు వెళ్లింది. పదో తరగతి చదువుతున్న కుమార్తె ఉదయం 9 గంటలకు పాఠశాలకు వెళ్లిపోయింది. అనంతరం మధ్యాహ్నం నాగజ్యోతి ఇంటికి వచ్చేసరికీ తలుపులు తెరచి, బీరువా తాళం పగలుకొట్టి ఉన్నాయి. దానిలోని 8 గ్రాముల చైన్, 17 గ్రాముల నాలుగు జతల చెవిదుద్దులు మాయమయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనలో నిందితుడికి రిమాండ్

పెదపూడి: వ్యక్తిపై దాడి చేసి, స్థానికులను భయభ్రాంతులకు గురి చేసిన ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించారని ఎస్సై కె.రామారావు తెలిపారు. సంపరలో ఈ నెల 9వ తేదీ రాత్రి ఆ గ్రామానికి చెందిన బి.వెంకటేశ్వరరావుతో ఎలుగుబంట్ల శ్రీరామ్ ఘర్షణకు దిగాడు. చంపుతానని బెదిరించి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో వెంకటేశ్వరరావుకు బలమైన గాయాలయ్యాయి. అలాగే స్థానిక ప్రజలను కూడా శ్రీరామ్ భయభ్రాంతులకు గురి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అరెస్ట్ చేసి కాకినాడ కోర్టుకు తరలించగా 15 రోజులు రిమాండ్ విధించారు. నిందితుడు అందరితో గొడవలకు పాల్పడుతున్న నేపథ్యంలో రౌడీషీట్ ఓపెన్ చేశామని ఎస్సై తెలిపారు.

ఇంటి నిర్మాణాల పరిశీలన



గృహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఈఈ రాజ్‌కుమార్ తదితరులు

రాజానగరం: ఇంటి నిర్మాణాలను మే నెలాఖరు నాటికి పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.రాజ్ కుమార్ లబ్ధిదారులకు సూచించారు. సూర్యారావుపేటలో జరుగుతున్న ఇంటి నిర్మాణాలను గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. మండలంలో 721 గృహాలు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఇస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని సత్వరమే నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు.

ఈ–పంట, ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి ఖాసిమ్

రాజానగరం: అన్నదాతలకు మెరుగైన సేవలు అందించేందుకు రూపొందించిన ఈ–పంట, ఈ–కేవైసీలను తప్పనిసరిగా చేయించాలని మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిమ్ రైతులకు సూచించారు. మండలంలోని పాలచర్లలో బుధవారం ×పాలెం పిలుస్తుంది₹ కార్యక్రమం జరిగింది. రైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను పొందేందుకు, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ పరికరాలను పొందేందుకు ఈ రెండు ప్రక్రియలు తప్పనిసరి అన్నారు. మండల ఉద్యాన శాఖాధికారి కె.దివ్యశ్రీ మాట్లాడుతూ తమ శాఖ ద్వారా నూరు శాతం రాయితీపై ఆయిల్ పామ్ మొక్కలను సరఫరా చేస్తున్నామన్నారు. ఆయిల్ పామ్ సాగు ఎంతో లాభదాయకమైనదంటూ మార్కెటింగ్ సదుపాయాలు, చెల్లింపులపై అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ సాగులో బిందు సేద్యం ఎంతో ప్రధానమైనదని, ఇందుకు అవసరమైన పరికరాలను కూడా రాయితీపై సరఫరా చేస్తున్నామన్నారు. వీటిని పొందాలంటే ముందుగా సమీపంలోని రైతు సేవా కేంద్రంలో రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. అలాగే మామిడి, జీడిమామిడి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.ప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయకులు, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

బిక్కవోలు: ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని విశాఖపట్నం చెందిన పిరమిడ్ మాస్టర్ వంశీ కిరణ్ అన్నారు. కొంకుదురులోని శివరామకృష్ణ పిరమిడ్ ధ్యాన మందిరం 7వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాకాహారం తినడం, ధ్యానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. అనంతరం స్వర్గీయ గోలుగూరి భాస్కరరెడ్డి, సుశీల దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అన్నసమారాధన నిర్వహించారు.

వైభవంగా కేశవస్వామి గ్రామోత్సవం

బిక్కవోలు: పందలపాక గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామివారి గరుడ వాహనం గ్రామోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. స్వామి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని అర్చకుడు వింజరపు కేశవాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రథం లాగారు.

ఘనంగా మదుగులమ్మ జాతర



ఆకట్టుకున్న గరగ నృత్యాలు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గ్రామ దేవత మదుగులమ్మ తల్లి జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గరగ నృత్యాలు, తీన్‌మార్ డప్పులు, వివిధ వేషధారణల నడుమ గ్రామోత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల : సంక్రాంతికి వస్తున్నాం
సూర్యమినీ : మికీ 17, శివంగి
సూర్యప్యాలెస్ : కింగ్‌స్టన్
స్వామి : శబ్దం
శివజ్యోతి : మజాకా, చావా
అనుశ్రీ : మజాకా
రాజా : అగత్యా
ఊర్వశి : తండేల్
మేనక : నారి, పౌరుషం
రంభ : రాక్షస, రారాజా
కుమారి : రిటర్న్స్ ఆఫ్ ది డ్రాగన్
అప్సర : సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు
అశోక : చావా

నామవరం
వీఎస్ మహల్ : చావా

ధవళేశ్వరం
మురళీకృష్ణ : చావా

కడియం
వెంకటసూర్య : చావా